# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### మూడు గంటలెట్ల సరిపోతది



చెన్నూర్ రూరల్, నవంబర్ 23 : కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాల గురించి ఏ ఒక్క నాయకుడూ పట్టించుకోలేదు. కరెంట్ సక్కగా ఇవ్వక పోతుండే. ఎక్కువ తక్కువ వచ్చే కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. అర్ధరాత్రి.. అపరాత్రి లేకుండా పొలాల పొంటి పోయేవాళ్లం. అనేక ఇబ్బందులు పడ్డం. తెలంగాణ వచ్చాక రైతుల బతుకులు మారినయి. రైతులకు ప్రాధాన్యత, గౌరవం పెరిగింది. 3 గంటల కరెంట్ రైతులకు సరిపోతుందా. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. మాకు సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తుండు. గతంలో రైతులు పడ్డ కష్టాలు సీఎం కేసీఆర్‌కు తెలుసు. రైతులకు పెట్టుబడి సాయమందించి అండగా నిలుస్తున్నడు. రైతుబీమాతో కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నడు. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయమంటే వేయం. అంతే..

**- మాదాసు పోచయ్య, రైతు, ఎర్రగుంటపల్లి**

### ఆ రోజులు గుర్తొస్తే ఏడుపొస్తది..



హాజీపూర్, నవంబర్ 23 : కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలను ఏ నాయకుడూ పట్టించుకున్న పాపాన పోలే. కరెంటు సక్కగ ఇయ్యక పోతుండురి. మోటార్లు కాలి పోయేటివి. అర్ధ రాత్రి, అపరాత్రి అనకుండా పొలాల పొంటి పోయేవాళ్లం. చీకట్లో విషపురుగుల పాలయ్యేటోళ్లం. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక పంటలు బాగా పండుతున్నయ్. కాంగ్రేసోళ్లు ఇచ్చే 3 గంటల కరెంటు ఎట్ల సరిపోతుంది. కొంచమన్నా దిమాకుండాలిగా కాంగ్రెసోళ్లకు. ఆ పార్టీకి ఓట్లు వేస్తే తిరిగి పాత రోజులు వస్తయ్. ఆ రోజులు మాత్రం మాకొద్దు. ఇప్పుడు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండు. ఇప్పుడు ఇష్టం వచ్చిన సమయంలో బాయికాడికి పోయి మోటార్ ఏసుకుంటున్నం.

**- గంధం రాజయ్య, టీకన్నపల్లె, హాజీపూర్ మండలం**

### రైతులను నిండా ముంచుడే..



హాజీపూర్, నవంబర్ 23 : మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటార్లంటే సన్న, చిన్నకారు రైతులను నిండా ముంచుడే. తెలంగాణలో అంతా మూడు, ఐదు హెచ్‌పీ మోటర్లతోనే బాయిలకాడ ఎవుసం సాగుతది. 10 హెచ్‌పీ మోటర్ కొని ఎవుసం చేయాలంటే లక్ష రూపాయల దాకా పెట్టుబడి అవుతుంది. మూడు గంటల కరెంటు విధానం వచ్చినా, 10 హెచ్‌పీ మోటర్లు వాడినా ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోతయ్. భూగర్భ జలాలు అడుగంటి పోతయ్. 24 గంటలు ఉచితంగా. నాణ్యమైన విద్యుత్‌తో బాగా పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్న రైతులకు కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులు రావడం ఖాయం.

**- తవుడు కొమురయ్య, టీకన్నపల్లె, హాజీపూర్**

### అప్పుల పాలు చేసేందుకు 10 హెచ్‌పీ మోటర్లు..



హాజీపూర్, నవంబర్ 23 : రైతులను అప్పుల పాలు చేసేందుకు కాంగ్రేసోళ్ళు కుట్రలు పన్నుతున్నరు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే రైతులు తమ బాయిలకు 10హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని అంటున్నరు. వాళ్లు గెలిస్తే ఎంత గోస పెడుతరో.ఆ మోటారు పెట్టాలంటే దాదాపు 1 లక్ష రూపాయల ఖర్చు అవుతుంది. అ మోటారుకు సరిపడా నీరుండాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో 3 హెచ్‌పీ మోటారు సరిపోతుంది. 10 హెచ్‌పీ మోటారు పెడితే కరెంటు బిల్లు కూడా ఎక్కువ వస్తుంది. సన్నకారు, చిన్నకారు రైతులకు 24 గంటల కరెంటు ఉంటే 10హెచ్‌పీ మోటార్ల అవసరం ఉండదని కాంగ్రేసోళ్లు తెలుసుకోవాలి.

**- ముడిమడుగుల శంకరయ్య, బుద్దిపల్లి, హాజీపూర్**

### కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయినం

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 23 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చినమాట ప్రకారం 24 గంటల కరెంటిచ్చి ఆదుకుంటున్నది. ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నది. కాంగ్రెస్ మాటలు నమ్మి రైతులు ఓట్లేసి గెలిపిస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవు. సీఎం కేసీఆర్ 24 గంటలు కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు చాలంటూ మాట్లాడుతున్నడు. గెలిస్తే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నడు. మూడు గంటల కరెంటుతో మూడు దొయ్యలు కూడా నిండవు. 10హెచ్‌పీ మోటర్లు రైతులకు ఎవరు కొనిస్తరు. అవి పెట్టుకున్న పెద్దగా ఏం లాభముంటది. 5 హెచ్‌పీ మోటర్లతో హాయిగా రైతులు వ్యవసాయం చేసుకుంటున్నరు. రైతులను నట్టేటముంచేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతుంది. 10 హెచ్‌పీ మోటర్లు నడిపితే బోర్లు ఎండిపోతయి. ఇక పొలానికి నీళ్లేలా పారుతయి. బీఆర్‌ఎస్ సర్కారు దయవల్ల రైతులు హాయిగా బతుకుతున్నరు. రైతులకు పంట పెట్టుబడి సాయమందిస్తున్నది. రైతుబంధు, రైతుబీమాలాంటి పథకాలు అందించి ఆదుకుంటున్నది. రైతుబంధు పథకాన్ని ఆపేయాలని ఇప్పటికే కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్ని రోజులు రైతులతో లేని కాంగ్రెస్ పార్టీని ఇప్పుడెట్లా నమ్మాలి. కారుచీకట్లలో మగ్గిన రోజుల నుంచి కరెంటు బల్బుల కింద బతుకుతున్న రోజులను ఎట్ల మర్చిపోతం. 60 ఏండ్లు నమ్మి మోసపోయాం. ఇప్పుడు కాంగ్రెస్ చెప్పే మాటలను అస్సలు నమ్మం. కేవలం రైతుల ఓట్ల కోసమే నాణ్యమైన కరెంటు ఇస్తామని చెబుతున్నరు. నమ్మి ఓటేస్తే మళ్లీ పాతరోజులు చూడాల్సి వస్తది. మాకు బీఆర్‌ఎస్ సర్కారు అందించే 24 గంటల కరెంటు కావాలి. కాంగ్రెస్ ఇచ్చే మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటార్లు వద్దు. ఈసారి కూడా రైతాంగానికి అన్ని విధాలా అండగా నిలబడుతున్న బీఆర్‌ఎస్ సర్కారుకే మద్దతిస్తాం. మళ్లీ సీఎంగా కేసీఆర్‌నే గెలిపించుకుంటాం.

**- బీ గోపి, రైతు, కన్నాల**

### కరెంటియ్యక నరకం చూపిన్రు..



హాజీపూర్, నవంబర్ 23 : కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడ్డం. ఎవుసమంటేనే భయపడేటట్లు చేసిన్రు. కరెంటియ్యక. నీళ్లియ్యక నరకం చూపిన్రు. అష్టకష్టాలు పడి ఎట్లనో అట్ల.. పంట తీస్తే సక్కగా కొనేటోళ్లు ఉండక పోతుండే. ధర కూడా అంతంత మాత్రమే ఉండేది. తెలంగాణ వచ్చినంక రైతుల బాధలు పోయినయ్. 24 గంటల కరెంటిస్తన్రు. పుష్కలంగా నీళ్లున్నయి. యేటా రెండు పంటలు తీస్తున్నం. ముఖ్యంగా ధరణితో భూ సమస్యలు పరిష్కారమైనయ్. కానీ కాంగ్రెసోళ్లు భూతద్దం పెట్టి సాకులు చూపుతూ బద్నాం చేస్తున్నరు తప్ప. ధరణి మస్తు మంచిగుంది. కాంగ్రెసోళ్లు పండి బొర్రినా నమ్మం.

**- దేవి చంద్రయ్య, దొనబండ**

# మూడు గంటలతో ముప్పుతిప్పలే

## కాంగ్రెస్ పాలనలో ప్రత్యక్ష నరకం చూపిన్రు

- కరెంట్ కోసం వేడుకున్నా కనికరించలే..
- 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేం ..
- 24 గంటల ఉచిత విద్యుత్‌తో రంది లేకుండా ఉన్నం
- కాంగ్రెస్‌ను నమ్మమంటున్న రైతులు

**కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు** కరెంటుకోసం ముప్పుతిప్పలు పడ్డామని, ప్రత్యక్ష నరకం చూపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికివచ్చే దశలో ఎండిపోయేవని, కరెంటో రామచంద్రా అని పాలకులను వేడుకున్నా కనికరించలేదని మండిపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంటుతో రంది లేకుంటా పంటలు తీస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటలు కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటార్లు వినియోగించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రైతులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, హస్తం పార్టీ నాయకులను నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం దండుగ అనే పరిస్థితులు ఉండేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల ఫలితంగా పదేళ్లలో వ్యవసాయం పండుగలా మారిందని కొనియాడుతున్నారు. తిరిగి కరెంటు కష్టాలను కొని తెచ్చుకునే పరిస్థితుల్లో లేమని, తమ అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌నే మరోసారి అధికారంలో నిలబెడుతామని స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

**- మంచిర్యాల, నవంబర్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**



### కాంగ్రెస్ నాయకులను నమ్మేదెట్లా

బెల్లంపల్లి, నవంబర్ 23 : ప్రతి ఒక్కరూ 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోతయి. వోల్టేజీ సమస్యతో మోటర్లు, స్టార్టర్లు, సర్వీస్ వైర్లు తరచూ కాలిపోతయి. మోటార్లు కాలిపోయిన ప్రతిసారి రైతులకు రూ.2 వేలకు పైగా మరమ్మతులకు ఖర్చు అవుతుంది. ఇవేగాక స్టార్టర్లు, కేబుల్ వైర్లు, ఫీజులు కాలిపోవడం వల్ల మరో రూ. 2 వేల అదనపు భారం పడుతుంది. 10 హెచ్‌పీ మోటరు కొనాలంటే రూ.లక్షకు పైగా ఖర్చవుతది. పైగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలి. మోటారు బిగించాలంటే కరెంటు వైర్లన్నీ మార్చాలి. అనవసరపు ఖర్చులు అవసరమా..? కాంగ్రెసోళ్లను నమ్మితే నట్టేట ముంచుతరు. గన్నేండ్లు పరిపాలించి చేసిందేమీ లేదు.. ఇప్పుడచ్చి.. అది చేస్తం.. ఇది చేస్తం.. అంటే నమ్మేదెట్లా..?

**- ఎస్ తిరుపతి, బెల్లంపల్లి**

### రాత్రంతా జాగారం చేసేటోళ్లం..



మందమర్రి రూరల్, నవంబర్ 23 : 24 గంటలు ఉచిత కరెంట్‌తో పసిడి పంటలు పండిస్తున్నం. కాంగ్రెస్ నాయకులు రేవంత్ రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అంటున్నడు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నడు. గా పనికి మాలిన మాటలు మాట్లాడడం సరికాదు. కాంగ్రెస్ పాలనలో రాత్రిళ్లు పొలాలకు నీరు పెట్టడానికి పోయి అక్కడే పడుకునేటోళ్లం. అంత కష్టపడితే రెండు.. మూడు మడులే తడిసేవి. పంట చేతికొచ్చే వరకు నరకం చూసేటోళ్లం. అదే తెలంగాణ ఏర్పడి కేసీఆర్ సీఎం అయినంక వ్యవసాయాన్ని పండుగ చేసిండు. 24 గంటల కరెంటిస్తున్నడు. రైతుబంధు, రైతుబీమాతో అండగా నిలుస్తున్నడు. ఓట్లప్పుడు వచ్చే కాంగ్రెసోళ్లను నమ్మేది లేదు. ఆ పార్టీ వచ్చేది లేదు. సచ్చేది లేదు. ఓటును వృథా చేయం. బీఆర్‌ఎస్‌నే గెలిపించుకుంటం.

**-దర్శనాల రవి, రైతు, మామిడిగట్టు**



### మోటర్లు కాలిపోతయ్..

మంచిర్యాల టౌన్, నవంబర్ 23 : 10 హెచ్‌పీ మోటర్లు నడవాలంటే ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో పెద్ద కెపాసిటీవి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇంతచేసినా భూగర్భంలో నీటి లభ్యత అందుకు సరిపడా ఉండాలి. ఇప్పుడు రైతులు ఐదు హెచ్‌పీ కెపాసిటీ మోటర్లను వాడుతున్నరు. తక్కువ కరెంటుతో ఆ మోటర్లు నడుస్తుంటాయి. ఇక మూడు గంటల కరెంటు రైతులకు ఏమాత్రం పనికిరాదు. 24 గంటల పాటు కరెంటు సరఫరా ఉంటే రైతు అవసరానికి సరిపడా నీటి లభ్యతను బట్టి మోటర్లను వాడుకునే వీలుంటుంది. మూడు గంటలే కరెంటు ఇస్తే.. అదే సమయంలో 10 హెచ్‌పీ మోటర్లు రైతులందరూ వేస్తే నీరు ఎండిపోతుంది. మోటర్లు కాలిపోతాయి.

**- వంగల నర్సింహమూర్తి, ఎలక్ట్రీషియన్, మోటర్ వైండింగ్, మంచిర్యాల**

### నమ్మితే నట్టేట మునుగుతం..

జైపూర్, నవంబర్ 23 : ధరణి తీసేస్తమని కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. రైతుకు నష్టం చేయడమే ఆ పార్టీ నైజం. తెలంగాణ రాక ముందు పట్వారీ వ్యవస్థ ఉండేది. పైసల కోసం ఇష్టమొచ్చినట్లు ఒకరి భూములు.. మరొకరికి రాసిన్రు. రైతులను అరిగోస పెట్టేటోళ్లు. ఇప్పుడు వాళ్లను నమ్మితే మళ్లా పాత కథే అయితది. ధరణితో రైతులకు మేలు జరుగుతుంది. ఇట్లా పోయి అట్లా పని చేసుకుని వస్తున్నం.

**-తోట లస్మయ్య, రైతు, నర్సింగపురం**



# ధరణి ఎత్తేస్తే పైరవీకారులదే రాజ్యం

## పైసలు ముట్టజెప్పనిదే ఫైలు ముందుకు కదలదు..

- పటేల్, పట్వారీ వ్యవస్థలు మళ్లీ పుట్టుకొస్తయ్..
- పట్టా కావాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..
- మళ్లీ పాత పద్ధతిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర

మంచిర్యాల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్ తీరుపై కర్షకలోకం భగ్గుమంటున్నది. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పవంటున్నారు. పాత పద్ధతిని తీసుకొచ్చి దళారీ వ్యవస్థను ప్రోత్సహించేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు. పట్టా పాస్‌బుక్‌లో కౌలుదారుని పేరును చేర్చి, రైతుతో సమానంగా వారికి కూడా హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై భయాందోళనకు గురవుతున్నారు. గతంలో తప్పుడు రికార్డుల కారణంగా అసలైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేవి కావు. దీంతో అనేక మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు కాంగ్రెస్ పాలనలో చూశామని గుర్తు చేసుకుంటున్నారు. ఇలాంటి సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు సీఎం కేసీఆర్ ధరణిని తేవడంతో రైతుల జీవితాలు బాగుపడ్డాయి.ధరణి ఆధారంగానే రైతుబంధు, రైతుబీమా పథకాలు అన్నదాత ఇంటికి చేరుతున్నాయి. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతన్న ఇంటికే అందేలా.. ధరణి పోర్టల్ రైతులకు ఉపయోగపడుతున్నది. అలాగే భూముల క్రయ, విక్రయాల ప్రక్రియ నిమిషాల వ్యవధిలో పూర్తవడం వంటివి ధరణి కారణంగానే జరుగుతున్నాయి. ఇలా అన్ని విధాలుగా రైతులకు అండగా ఉన్న ధరణిపై కాంగ్రెస్ నాయకులు కుట్రలకు తెరలేపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి రైతుల మధ్య చిచ్చు పెట్టే యత్నాలను తిప్పి కొడతామని ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

### ధరణితో దళారీ వ్యవస్థ పోయింది



కాసిపేట, నవంబర్ 23 : తెలంగాణలో ధరణి అమలు చేయడం వల్ల దళారీ వ్యవస్థ పూర్తిగా పోయింది. కానీ.. కాంగ్రెస్ మాత్రం మళ్లీ దళారీ వ్యవస్థనే ప్రోత్సహించే విధంగా పాత రెవెన్యూ విధానం తీసుకు వస్తామని చెప్పడం సరికాదు. ధరణి తీసేస్తామని కాంగ్రెస్ వాళ్లు అనడం సరైంది కాదు. గతంలో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ధరణితో ఆన్‌లైన్ విధానంతో రైతులకు లాభం చేకూరింది.

**- గుండేటి రమేశ్, యువ రైతు, కాసిపేట**

### కాంగ్రెస్‌ను నమ్మేదే లేదు



కాసిపేట, నవంబర్ 23 : తెలంగాణలో ధరణితో అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇంతకు ముందు సరైన విధానం లేక భూ వివరాలు సక్రమంగా లేక అనేక ఇబ్బందులు పడ్డరు. ఇప్పుడు ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఆన్‌లైన్ ద్వారా పనులు ఈజీగా అవుతున్నయి. ధరణి రద్దు చేసి పాత రెవెన్యూ వ్యవస్థను తీసుకువస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. మరి ఇన్నేండ్లు పరిపాలించి ఏం చేసిన్రో చెప్పాలి. మంచి పనులు చేయరు.. చేసేటోళ్లను చేయనీయరు. గా పార్టీని నమ్మే ప్రసక్తే లేదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే గోసపడ్డట్లే.

**- మోతీ నాయక్, రైతు, కాసిపేట**

### ధరణితో నిమిషాల్లో పనులైతన్నయ్



జైపూర్, నవంబర్ 23 : కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో నిమిషాల్లో పనులైతన్నయ్. ధరణి తీసేస్తే రైతులు ఆగమైతరు. అంతకు ముందు పైరోకు ఉన్నోడు భూములను తమ పేరు మీద మార్చుకునేటోడు. ధరణి తీసేస్తే అధికారుల ఇష్టారాజ్యం అయితది. ధరణిలో పొద్దుగాల రిజిస్ట్రేషన్‌కు పోతే మాపటేళ్లకు బుక్కు ఇస్తన్రు. ధరణి లేకముందు పహాణీ, పట్టా పాసు బుక్కు తీసుకోవాలంటే తహశీల్దార్ కార్యాలయం చుట్టూరా తిరుగుతుండేటిది. ధరణి ఎప్పటికీ ఉండాల్సిందే.

**- గుజ్జేటి చంద్రమౌళి, రైతు, బెజ్జాల**

### రైతులు రోడ్డున పడుతరు..



చెన్నూర్ రూరల్, నవంబర్ 23 : ధరణిని తీసేస్తమని కాంగ్రెస్ నాయకులు చెబుతుంటేనే భయమేస్తుంది. ధరణితో భూములకు భద్రత ఉంది. పట్టాల మార్పిడి ఉండదు. ధరణి పోతే మళ్లీ పాత రోజులు వస్తాయి. భూమాత పేరుతో కౌలు, అనుభవదారుల కాలమ్స్ ఏర్పాటు చేసి రికార్డులు తారుమారు చేస్తరని భయంగా ఉంది. వీఆర్వోల కాలం వస్తే రైతులు మళ్లీ రోడ్డు ఎక్కుతారు. భూముల విషయంలో గొడవలు జరిగి పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా పెరుగుతాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావద్దనే రైతులమంతా కోరుకుంటున్నం. కాంగ్రెస్ నాయకుల మాటలు విని మళ్లీ మోసపోము.

**- పైడాకుల రాయమల్లు, రైతు, కొమ్మెర**

### వాళ్ల మాటలు పట్టుకుంటే బూడిదే..



జైపూర్, నవంబర్ 23 : సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో నిమిషాల్లో పనులైతన్నయ్. ధరణిని తీసేస్తే రైతులు ఆగమైతరు. ధరణి ద్వారా రైతుల భూములకు పూర్తి రక్షణ ఉంది. అంతకు ముందు పైరోకు ఉన్నోడు భూములను ఇష్టమొచ్చినట్లు మార్పించుకున్నడు. డబ్బుల కోసం ఏది పడితే అదే చేసిన్రు. గిప్పుడు ధరణిలో పొద్దుగాల రిజిస్ట్రేషన్‌కు పోతే మాపటేళ్లకు బుక్కు ఇస్తన్రు. ధరణి లేకముందు పహానీ, పట్టా పాసు బుక్కు తీసుకోవాలంటే తహశీల్దార్ కార్యాలయం చుట్టూరా తిరగాల్సి వచ్చేది. ధరణి ఎప్పటికీ ఉండాల్సిందే. కాంగ్రెసోళ్ల మాటలు పట్టుకుంటే బతుకులు బూడిదే.

**-ఇండ్ల రాజం, రైతు, ఇందారం**

### కర్రుకాల్చి వాత పెట్టాలి..

నెన్నెల, నవంబర్ 23 : ధరణి రాక ముందు రైతులు ఎలాంటి గోస పడ్డరో రైతులకు తెలుసు . దానినీ తీసివేయాలని మాట్లాడే కాంగ్రెసోళ్లకు రైతులు కర్రు కాల్చి వాత పెడ్తరు. గతంలో భూమి పట్టా కావాలంటే మస్తు తిప్పలపడ్డం. నరకం చూపెటోళ్లు. గట్లంటోళ్లను నమ్ముతమా.. ఓటు వేస్తమా. సీఎం కేసీఆర్ దేవునోలే ధరణి పెట్టి ఎక్కడి రైతులకు అక్కడే పట్టాలు అయ్యేటట్లు చేసిండు. ఇంతకంటే మంచి చేసినోడు ఎక్కడున్నడో కాంగ్రెసోళ్లు చూపెట్టాలి. రైతులు బాధ పడొద్దనే కదా సీఎం కేసీఆర్ ధరణి తీసుకొచ్చిండు. ఎలాంటి అవకతవకలు జరగకుండా భూములను ఆన్‌లైన్ చేసిండు. రక్షణ కల్పించిండు. గతంలో ఇష్టమున్నట్లు భూ రికార్డులు ఉండే.. కాని ఇప్పుడు ప్రతి భూమి ధరణిలో ఉంటుంది. యజమాని సంతకం చేస్తేనే భూమి మార్పిడి జరుగుతుంది. ధరణి వల్ల గంటలో భూమి రిజిస్ట్రేషన్ అయ్యి ప్రొసీడింగ్ చేతికి ఇస్తున్నరు. కాంగ్రెసోళ్లు వస్తే భూములు మళ్లా తారుమారు చేస్తరు. పోలీస్‌స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరిగే కాలం వస్తది. మాలాంటి రైతుల నోట్లో మట్టి పడుతది.

**- గడ్డం సత్యగౌడ్, రైతు, మైలారం**

